ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలు నేడు

● కేపీహెచ్‌బీ రమ్యగ్రౌండ్‌లో ఏర్పాట్లు



కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని, ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు బెంగళూరు, రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన ఆధ్వర్యంలో ఆదివారం కేపీహెచ్‌బీ రమ్యగ్రౌండ్‌లో నిర్వహిస్తున్నారు. ఆసక్తి గల యువతులు, మహిళలు పాల్గొనవచ్చు. చుక్కల ము గ్గులు మాత్రమే వేయాలి. ఎవరి రంగులు వారే తెచ్చుకోవాలి. ముగ్గులో గొబ్బెమ్మలు, బతుకమ్మలను పేర్చుతూ పువ్వులు, రంగులతో అందంగా అలంకరించుకోవచ్చు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.6వేలు, ద్వితీయ బహుమతి రూ.4వేలు, తృతీ య బహుమతి రూ.3వేల చొప్పున నగదు అందజేస్తారు. ముగ్గు వేసిన ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతి ఉంటుంది. మరిన్ని వివరాలకు 9985411022, 9700637537 ఫోన్ నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకొని ముగ్గుల పోటీల్లో పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు.

చందానగర్ పీజేఆర్ స్టేడియంలో..

చందానగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గులు, పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు బెంగళూరు, రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన ఆధ్వర్యంలో ఆదివారం చందానగర్ పీజేఆర్ స్టేడియంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. ఆసక్తి గల మహిళలు పాల్గొనవచ్చు. చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి, ఎవరి రంగులు వారే తెచ్చుకోవాలి, ముగ్గుల్లో గొబ్బెమ్మలు, బతుకమ్మలను పేర్చుతూ పువ్వులు, రంగులతో అందంగా అలంకరించుకోవచ్చు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.6వేలు, ద్వితీయ బహుమతి రూ.4వేలు, తృతీయ బహుమతి రూ.3వేలు అందజేస్తారు. ముగ్గులు వేసిన ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు ఉంటాయి. వివరాలకు 92463 94121, 84988 09082 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.



మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను కలిసిన అసోసియేషన్ సభ్యులు

కాలనీ అభివృద్ధికి కృషి చేయాలి

గాజులరామారం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ సభ్యులు కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం డివిజన్ మహాదేవపురం అసోసియేషన్ సభ్యులు శనివారం శ్రీశైలంగౌడ్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ కాలనీలో ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుక వస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులు జగదీశ్వర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీలు దుగ్యాల ప్రసాద్, రామచంద్రారెడ్డి, ప్రవీణ్, సభ్యులు మహేందర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్

ఫతేనగర్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మంజూరైన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పి. సతీష్‌గౌడ్ అధికారులకు చెప్పారు. శనివారం ఉదయం ఫతేనగర్ డివిజన్ పరిధిలోని దోబీఘాట్ నిర్మాణ పనులు, సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఏఈ పవన్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు వీరేశంగుప్తా, అశోక్, ఎట్టయ్య స్వామి, సురేంద్ర, నాయకులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ఆవిష్కరణ



విగ్రహ ఆవిష్కరణలో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ శ్రీనివాసరావు

హైదర్‌నగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ శ్రీనివాసకాలనీలో 27 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహ ఆవిష్కరణ మహోత్సవం పురోహితుల వేదమంత్రాల మధ్య శనివారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు గడ్డం రంజిత్‌రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాలు పూర్తి చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, విగ్రహ నిర్మాణ దాత దామోదర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, సమీప కాలనీల భక్తులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

తిరుమల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజేష్ బిందాల్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపానికి చేరుకోగా.. వేదపండితులు ఆశీర్వచనం చేశారు. తర్వాత అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. అలాగే తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

గొర్రెల పంపిణీ పథకంలో గోల్‌మాల్

- రైతులకు ఇవ్వాల్సిన రూ.2.10 కోట్లు
- బినామీ ఖాతాలకు మళ్లింపు
- మాజీమంత్రి ఓఎస్డీ హస్తంపై అనుమానాలు
- గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

హైదరాబాద్, రాయదుర్గం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీ పథకంలో గోల్‌మాల్ చోటు చేసుకోగా గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. రైతుల నుంచి కొనుగోలు చేసిన గొర్రెలకు సంబంధించిన డబ్బుల్ని వారి ఖాతాల్లో వేయకుండా బినామీ ఖాతాల్లో వేయడంతో రైతుల ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. గతంలో ఉన్న తెలంగాణ ప్రభుత్వం రైతులకు గొర్రెలు పంపిణీ చేసేందుకు నిర్ణయించగా గత ఏడాది ఆగస్టులో కొండాపూర్‌కు చెందిన సయ్యద్ మొయిద్‌కు చెందిన లోలోనా ది లైవ్ కంపెనీకి కాంట్రాక్ట్ ఇచ్చారు. గొర్రెల కొనుగోలు కోసం మొయిద్ పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు రవికుమార్, కేశవసాయిలు పలు రాష్ట్రాల్లో పరిశీలించి చివరికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో 18 మంది రైతుల నుంచి 133 యూనిట్ల గొర్రెలను కొనుగోలు చేశారు. ఆ రైతులకు చెల్లించాల్సిన డబ్బును వారి ఖాతాల్లో వేసే బాధ్యతను పశుసంవర్ధకశాఖ అధికారులు కాంట్రాక్టర్ మొయిద్‌కు అప్పగించారు. దీంతో అతడు పశుసంవర్ధక శాఖ అధికారులు కలిసి బినామీ అకౌంట్లు తయారుచేసి మొత్తం రూ.2.10 కోట్ల నగదు సొంత ఖాతాల్లో జమ చేసుకున్నారు. కాగా రైతులు డబ్బుల కోసం ప్రయత్నం చేసి చివరికి పశుసంవర్ధక శాఖ కార్యాలయాన్ని సంప్రదించారు. అప్పటికే నగదు చెల్లింపులు పూర్తయినట్లు అక్కడ వారికి చెప్పారు. దీంతో తమకు చెల్లించాల్సిన డబ్బు బినామీ ఖాతాల్లోకి మళ్లించినట్లు గుర్తించి గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మొయిద్‌తో పాటు అసిస్టెంట్ డైరెక్టర్లు రవికుమార్, కేశవసాయి మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయంపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించగా.. నగదు వేరే వారి ఖాతాల్లోకి బదిలీ అవ్వడం వెనుక గత ప్రభుత్వంలో పశుసంవర్ధక శాఖ మంత్రి వద్ద ఓఎస్డీగా పనిచేసిన అధికారి హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా ఇదంతా ఒక పక్కా ప్రణాళిక మేరకే జరిగిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజాపాలనకు దరఖాస్తుల వెల్లువ

కూకట్‌పల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ప్రాంతంలో ప్రజాపాలనకు సంబంధించిన దరఖాస్తులు పెద్దఎత్తున దాఖలయ్యాయి. అభయ హస్తం పథకంలో భాగంగా అధికంగా దరఖాస్తు చేసుకున్నారు. రేషన్‌కార్డులు, ఇతర సమస్యలపై దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. మూసాపేట, కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలోని ప్రజల నుంచి మొత్తం 1,68,181 దరఖాస్తులు అందాయి. మూసాపేట సర్కిల్ పరిధిలోని అభయహస్తం పథకాలు పొందేందుకు 62,637 దరఖాస్తులు అందగా.. రేషన్‌కార్డులు, ఇతర దరఖాస్తులు 13,478 అందాయి. మొత్తం 76,115 దరఖాస్తులు అందాయి. కూకట్‌పల్లి సర్కిల్ నుంచి అభయహస్తం పథకానికి 72,733 దరఖాస్తులు రాగా.. రేషన్‌కార్డులు, ఇతర సమస్యల కోసం 19,333 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 92,066 దరఖాస్తులు అందినట్లు అధికారులు ప్రకటించారు.

శేరిలింగంపల్లి సర్కిల్‌లో 40వేలు..

గచ్చిబౌలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ప్రజాపాలన ముగింపురోజు మొత్తం 5,500 దరఖాస్తులు అందాయని ఉప కమిషనర్ రజనికాంత్‌రెడ్డి తెలిపారు. అభయహస్తం దరఖాస్తులు 3500 దరఖాస్తులు కాగా 2వేల దరఖాస్తులు వివిధ సమస్యలపై వచ్చాయని తెలిపారు. సర్కిల్ పరిధిలో మొత్తం సుమారు 40వేల దరఖాస్తులు వచ్చాయని, అందులో 15వేలు వివిధ సమస్య లపై వచ్చినట్లు ఆయన వివరించారు.. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపించనున్నట్లు పేర్కొన్నారు.

పరిశీలించిన జగదీశ్వర్‌గౌడ్

చందానగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): చందానగర్ డివిజన్, శేరిలింగంపల్లి డివిజన్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల కేంద్రాలను శనివారం శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ పరిశీలించారు. చివరి రోజు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి దరఖాస్తులు అందించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. అర్హులందరికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కృష్ణముదిరాజ్, రఘునందన్‌రెడ్డి, శేఖర్‌ముదిరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, వీరేశంగౌడ్ పాల్గొన్నారు.

సందర్శించిన కాంగ్రెస్ నాయకులు

బాలానగర్ : బాలానగర్ డివిజన్ పరిధి ఇందిరానగర్ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని కాంగ్రెస్ నాయకులు నాగిరెడ్డి, పుష్పారెడ్డి, మధుగౌడ్ తదితరులు సందర్శించి మహిళలకు దరఖాస్తులను అందజేశారు.



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న జగదీశ్వర్‌గౌడ్

అర్హులైన ప్రతి ఒక్కరికీ స్కీమ్‌లు..

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీ స్కీమ్‌లను ప్రభుత్వం అమలు చేస్తుందని కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. ఈ మేరకు కేపీహెచ్‌బీ వార్డు కార్యాలయంలో శనివారం అభయహస్తం దరఖాస్తుదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చిత్తారమ్మదేవి జాతరకు ఏర్పాట్లు



చిత్తారమ్మదేవి ఆలయం

షాపూర్‌నగర్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): గాజులరామారం చిత్తారమ్మదేవి జాతరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈనెల 19నుంచి వారం రోజులపాటు జరుగనున్న అమ్మవారి జాతరకు కమిటీ వారు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. కమిటీ అధ్యక్షుడు కూన అంతయ్యగౌడ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం జాతరను అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. జాతరకు జంటనగరాల నుంచే కాక తెలంగాణ అన్ని జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు విచ్చేయనున్నట్లు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఎనిమిది రోజుల పాటు జరుగనున్న జాతరలో అమ్మవారికి ఒక్కోరోజు ఒక్కో విధంగా పూజలు నిర్వహిస్తామన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జీడిమెట్ల పోలీసుల రక్షణలో గట్టి బందోబస్తు నిర్వహిస్తారని, అన్నిశాఖల అధికారులు జాతరలో పాలుపంచుకోనున్నారని తెలిపారు. జాతర ఈ నెల 19న శుక్రవారం ప్రారంభం అవుతుందని ప్రధాన జాతర ఈనెల 21న ఆదివారం జరుగనుందన్నారు. ఆఖరు రోజున భక్తులు ఇచ్చే వడిబియ్యంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.



మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మామిడి సోమయ్య

జర్నలిస్టుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తాం

● మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

రాంనగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, దీర్ఘకాలంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు కోరారని, ప్రధానంగా ఇళ్ల స్థలాల సమస్యను గత ప్రభుత్వం పరిష్కరించకుండా పదేళ్లుగా జాప్యం చేసిందని తెలిపారన్నారు. శనివారం జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షుడు పులిపలుపుల ఆనందం, తన్నీరు శ్రీనివాస్, కార్యదర్శి ఇ.చంద్రశేఖర్, నాయకులు కె.పాండురంగారావు, జె.ఉదయభాస్కర్‌రెడ్డి, యర్రమిల్లి రామారావు తదితరులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి సమర్పించారు. జర్నలిస్టులకు గతంలో మూడు సార్లు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, ఇప్పుడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇస్తుందన్న నమ్మకం ఉందని వారు మంత్రికి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వ హయాంలో అనేక మంది జర్నలిస్టులపై దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసుల పెట్టారని, అలాంటి జరగకుండా నిరోధించాలని, రాష్ట్ర జిల్లా స్థాయి కమిటీలు వేయాలని కోరారు. జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టులను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన విషయం వాస్తవమేనని, వారి సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట

- టీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్
- మియాపూర్- 2 డిపోలో సందడిగా వన భోజనాలు



ప్రతిభ కనబర్చిన సిబ్బందిని అభినందిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

హైదరాబాద్ సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని టీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. ఉద్యోగులు నిబద్ధత, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించడం వల్లే టీఎస్ ఆర్టీసీ మంచి ఫలితాలు సాధిస్తుందని అన్నారు. సికింద్రాబాద్ రీజియన్ పరిధిలోని మియాపూర్-2 డిపో ప్రాంగణంలో శనివారం నిర్వహించిన వనభోజనాల కార్యక్రమాల్లో ఎండీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మియాపూర్-2లో విధుల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన కండక్టర్లు అరుణ జ్యోతి, అరుణకుమారితో పాటు డ్రైవర్లు బాబు, బాల్‌రెడ్డిని సన్మానించారు. అనంతరం సిబ్బందితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్‌లో గతంలో రోజుకు సగటున 11-12 లక్షల మంది ప్రయాణిస్తే.. ప్రస్తుతం మహాలక్ష్మి పథకం అమలుతో అది 20లక్షలకు పెరిగిందన్నారు. సంస్థకు ప్రయాణికులు, సిబ్బంది రెండు కళ్ల లాంటి వారని ఆయన అన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణకాంత్, వెంకటేశ్వర్లు, సైబరాబాద్ ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి, సికింద్రాబాద్ ఆర్ఎం ఖుశ్రోషాఖాన్, కూకట్‌పల్లి డిప్యూటీ ఆర్ఎం కవిత, డీఎంలు శంకర్‌రావు, వెంకటేశం పాల్గొన్నారు.

అండగా ఉంటా..



కేపీహెచ్‌బీలో 4200 మెజార్టీ ఇచ్చిన ఓటర్ల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి తొమ్మిదోఫేజ్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కోసం పనిచేసిన నాయకులతో శనివారం ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే పాల్గొని కృతజ్ఞతలు తెలిపారు. - కేపీహెచ్‌బీకాలనీ, ఆంధ్రజ్యోతి

అక్రమ నిర్మాణాలు, చెరువుల కబ్జాదారుల పై చర్యలు

● కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్



మాట్లాడుతున్న బండి రమేశ్, కాంగ్రెస్ నాయకులు

బాలానగర్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని వమ్ము కానివ్వనని కాం గ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. శనివారం బాలానగర్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు జేఎన్‌టీయూ, మూసాపేట్, బోయినపల్లి చౌరస్తా వద్ద అండర్ పాస్ నిర్మాణం, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం జేఎన్‌టీయూ నుంచి హైటెక్ సిటీ వరకు మెట్రో లింక్ కలపాలని దీంతో ట్రాఫిక్ సమస్య అదుపులోకి వస్తుందనే విషయమై ఇంజనీరింగ్ నిపుణులతో చర్చిస్తున్నట్లు చెప్పారు. మియాపూర్ నుంచి పటాన్ చెరువు వరకు మెట్రోను ఎక్స్‌టెన్షన్ చేసేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉన్నదని అన్నారు. నియోజకవర్గంలో అక్రమ నిర్మాణాలు, చెరువుల కబ్జాదారుల తాటతీస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బి బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, నాయకులు శేరి సతీష్‌రెడ్డి, ధినేష్‌కుమార్, సునిల్‌యాదవ్, కృష్ణ అనిల్, స్వరూపాముదిరాజ్, కృష్ణ, శివ, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

సైబరాబాద్‌లో బాధ్యత తీసుకున్న కొత్త డీసీపీలు

హైదరాబాద్ సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో డీసీపీల బదిలీల్లో భాగంగా కొత్త డీసీపీలు బాధ్యతలు తీసుకున్నారు. సైబరాబాద్ క్రైం డీసీపీగా నరసింహారెడ్డి కొత్తపల్లి, రాజేంద్రనగర్ డీసీపీగా శ్రీనివాస్, సైబర్‌క్రైం డీసీపీగా శిల్పవల్లి, ఉమెన్ సేఫ్టీ డీసీపీగా సృజన కర్ణం, మేడ్చల్ డీసీపీగా శ్రీనివాస్ దన్నరపు బాధ్యతుల స్వీకరించారు. అనంతరం సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మొహంతిని మర్యాదపూర్వకంగా కలిశారు.

అయోధ్య అక్షింతల పంపిణీ



అక్షింతలు పంపిణీ చేస్తున్న రామభక్తులు

కూకట్‌పల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అయోధ్య శ్రీరాముడిచే పూజింపబడిన అక్షింతలు పంపిణీ కార్యక్రమం శనివారం కూకట్‌పల్లి వైజంక్షన్‌లోని ములుగు జయభారతి అపార్ట్‌మెంట్స్ ప్రాంగణంలో జరిగింది. బీజేపీ నాయకుడు బలరాంరాజు ఆధ్వర్యంలో పలువురు రామభక్తులు ఇంటింటికీ తిరిగి పూజాక్షింతలను స్థానికులకు అందజేశారు. అయోధ్య రామమందిర చిత్రపటాలు, ఈనెల 22న నిర్వహించనున్న విగ్రహ ప్రతిష్ఠ విధివిధానాలు, నియమ నిబంధనలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శ్రీఖర్‌రావు, రాజారావు, సుధాకర్‌చారి, కళ్యాణ్, రవికుమార్, గుణవతి పాల్గొన్నారు.

పేట్‌బషీరాబాద్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అయోధ్యరామయ్య ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని రామమందిరం నుంచి వచ్చిన అక్షింతలను జీడిమెట్ల డివిజన్ ఫస్ట్ ఎవెన్యూకాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి సభ్యులతో కలిసి ఇంటింటికీ పంపిణీ చేశారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



పూజల్లో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

చందానగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): చందానగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం జరిగిన స్వామివారి కల్యాణం, పుష్పయాగం, అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. మాజీ కౌన్సిలర్ రఘుపతిరెడ్డి, మాజీ కార్పొరేటర్ అశోక్ గౌడ్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, సంజీవరెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

సిటీ టు హంపీ కార్ల ర్యాలీ

'రోటరీ' ఆధ్వర్యంలో..



కారుపై గిటార్ వాయిస్తూ నాట్యం చేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

రాజేంద్రనగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వర్‌రావు(సీఆర్) ఫౌండేషన్‌లో డయగ్నోసిస్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు నిధుల సేకరణ కోసం రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ ఆధ్వర్యంలో శనివారం కార్ ర్యాలీ నిర్వహించారు. రాజేంద్రనగర్ సర్కిల్‌లోని ఉప్పర్‌పల్లి సోలిటర్ ఇంటర్నేషనల్ హైస్కూల్ నుంచి కర్ణాటకలోని హంపీ వరకు 364 కిలోమీటర్లు ఈ ర్యాలీ సాగనుంది. 20 కార్లలో వంద మంది సభ్యులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీలో కార్ల వేగం 45 కిలోమీటర్లు మించకుండా ఉంటుంది. కార్లు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, వాట్సాప్ చాటింగ్ చేస్తు కార్లు నడపవద్దని, అతివేగంతో కార్లు నడపవద్దని, మద్యం సేవించి కార్లు నడపవద్దనే సందేశాలు ఇస్తూ ర్యాలీ సాగుతుందని రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ దక్కన్ అధ్యక్షుడు అనిల్ రాంచందానీ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మీర్ ముర్తుజా అలీ తదితరులు పాల్గొన్నారు.



గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరిస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఇరుముడి కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద పాల్గొన్నారు.
- గాజులరామారం, ఆంధ్రజ్యోతి

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

జీడిమెట్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన జగద్గిరిగుట్ట పైప్‌లైన్ రోడ్డులో శుక్రవారం రాత్రి జరిగింది. జీడిమెట్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట ప్రాంతంలోని అస్బెస్టాస్‌కాలనీకి చెందిన జాగోరి అర్జున్(37) ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి షాపూర్‌నగర్ నుంచి జగద్గిరిగుట్ట వైపు పని ముగించుకుని ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. గుర్తు తెలియని వాహనం అతడి బైకును ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

13 ఏళ్ల బాలుడికి కేన్సర్ ఎముక సర్జరీ

● మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స



రోగితో వైద్య బృందం

హైదరాబాద్ సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): 'ఆస్టియోసార్కోమా' కేన్సర్‌తో బాధపడుతున్న కాకినాడ జిల్లాకు చెందిన 13 ఏళ్ల బాలుడికి మెడికవర్ ఆస్పత్రి అరుదైన సర్జరీ నిర్వహించారు. ఆ బాలుడిని పరిశీలించిన ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ అరుణ్‌కుమార్ అతనికి భుజపు ఎముకలో ట్యూమర్ (కణితి)ని గుర్తించి సర్జరీ చేయాలని నిర్ణయించారు. శస్త్ర చికిత్స ప్రక్రియలో భాగంగా అతని భుజం కీలు ఎముకను విడదీసి కణతిని తొలగించారు. కణితిని తొలగించి కృత్రిమ ఎముకతో భర్తీ చేశారు. ఎక్స్‌ట్రాకార్పోరియల్ రేడియేషన్, ఇంప్లాంటేషన్ చేసినట్లు వైద్యులు వివరించారు. ఆ బాలుడి వయస్సుతో అవయవాల పొడవును పరిగణనలోకి తీసుకొని, రోగికి ఈసీఐఆర్ విధానంలో సర్జరీ నిర్వహించారు. శస్త్రచికిత్సకు ముందు రోగికి ఈసీఐఆర్ కోసం మూడు సైకిల్స్ నియోఅడ్జువాంట్ కీమోథెరపీని డాక్టర్ మురళీధర్, మెడికల్ ఆంకాలజిస్ట్ ఆధ్వర్యంలో ఇచ్చారు. ప్రక్రియలో భాగంగా రోగి మోచేయి నుంచి భుజం వరకు కలిగిన ఎముకను బైటికి తీశారు. ఎముకకు ఉన్న కేన్సర్ కణజాలాలను రేడియేషన్ ద్వారా తొలగించినట్లు రేడియేషన్ అంకాలజిస్టు డాక్టర్ పృథ్వీరాజ్ మాసపు తెలిపారు. ఆ రేడియేటెడ్ ఎముకను తిరిగి బాలుడికి అమర్చి, మోచేయి కింద అన్ని కదలికలు, కార్యకలాపాలను చేసేవిధంగా సరిచేసినట్లు తెలిపారు. దీంతో అతను ఆహారం స్వయంగా తీసుకోవడం, రాయడం, చేస్తున్నట్లు చెప్పారు. ఆస్టియోసార్కోమా అనేది ఎముకలను ఏర్పరిచే కణాలలో ప్రారంభమయ్యే ఒక రకమైన కేన్సర్ అని, ఇది ఎముకల్లో అసాధారణ కణాలు నియంత్రణ లేకుండా పెరిగినప్పుడు ఈ కేన్సర్ వస్తుందని అరుణ్‌కుమార్ తెలిపారు.